సాక్షి
మహబూబాబాద్
బుధవారం । 27 । మార్చి । 2024



ఖాతాదారుల కష్టాలు
ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ సేవల్లో అంతరాయంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- 8లో▸



రక్తదానం.. సామాజిక సేవ
రక్తదానం.. ఇతరులకు ప్రాణదానమని, ఇది సామాజిక సేవా కార్యక్రమమని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు.
- 8లో▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
39.5°/21.0°
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి కాస్త చలి తీవ్రత ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ	గురు
6:35	4:51

లిక్కర్ పక్కదారి!

- ఎక్సైజ్‌శాఖ స్వాధీనం చేసుకున్న మద్యం మాయం
- తొర్రూరు స్టేషన్ నుంచి బయటకు తరలించిన వైనం
- ఆశాఖలోని ఉద్యోగులే పాత్రధారులు
- మిగిలిన స్టేషన్లపై కూడా అనుమానం



సాక్షి, మహబూబాబాద్/తొర్రూరు: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మద్యం అక్రమ రవాణా, అమ్మకాలపై పోలీస్, ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో దొరికిన మద్యాన్ని పట్టుకొని ఎక్సైజ్ స్టేషన్లలో పెట్టారు. అయితే దీనిని కాపాడి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిస్పోజల్ చేయడం లేదా డిపార్ట్‌మెంట్‌కు అప్పగించాల్సిన అధికారులే మాయం చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఎక్సైజ్‌శాఖలోని కొందరు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మద్యం బయటకు తీసుకెళ్లడం, వైన్స్ షాపుల్లో పెట్టి అమ్మకాలు చేపట్టడం, తమకు నచ్చిన వారికి అప్పజెప్పుతున్నారని ప్రచారం. కాగా డిపార్ట్‌మెంట్‌కు చెందిన మద్యం రోజురోజుకూ ఖాళీ అవుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రూ.3,31,51,815 లిక్కర్ సీజ్

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా చూడాలనే ఉద్దేశంతో జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులు పెట్టారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద తనిఖీలు చేశారు. పలు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన మద్యం స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలోని మహబూబాబాద్, తొర్రూరు, గూడూరు ఎక్సైజ్ సర్కిళ్ల పరిధిలో 2023 అక్టోబర్ 9నుంచి డిసెంబర్ 3వ తేదీ వరకు 979 మందిని బైండోవర్ చేసి 38 వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా రూ.3,31,51,815 విలువగల లిక్కర్‌తోపాటు వాహనాల విలువ కలిపి మొత్తం రూ.3,61,00,815ను సీజ్ చేశారు. ఆయా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాల్లో భద్రపరిచారు.

ఇతర స్టేషన్లపై అనుమానం..

తొర్రూరులో ఎక్సైజ్ సర్కిల్ నుంచి మద్యం పక్కదారి పట్టిన విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లాలోని ఇతర స్టేషన్లలో నిల్వ ఉన్న మద్యంపై కూడా పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. జిల్లా కేంద్రంలోని నిల్వ మద్యాన్ని ఆ శాఖలోని ఓ అధికారి తనకు నచ్చిన వారికి ధారాదత్తం చేశారనే ప్రచారం. అదేవిధంగా గూడూరు ఆఫీస్‌లోని మద్యం సీసాల్లో కూడా తేడాలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టి ఎన్నికల సందర్భంగా స్వాధీనం చేసుకున్న మద్యం.. ఇప్పుడున్న నిల్వలను సరిచూసి నిబంధనల ప్రకారం దానిని డిస్పోజ్ చేయడమో.. లేదా ఇతర ప్రాంతాలకు తరలించడమో చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్వాధీనం చేసుకున్న మద్యం వివరాలు

ఎక్సైజ్ సర్కిల్	స్వాధీనం చేసుకున్న లిక్కర్	విలువ
మహబూబాబాద్	36,002.24 లీటర్లు	రూ. 1,47,47,848
తొర్రూరు	23,556.46 లీటర్లు	రూ. 95,48,839
గూడూరు	20,274.55 లీటర్లు	రూ. 88,55,127.
మొత్తం	79,833.25 లీటర్లు	రూ. 3,31,51,815

ఆటోలో తరలించిన సిబ్బంది..

తొర్రూరు ఎక్సైజ్ కార్యాలయంలో సీజ్ చేసిన మద్యాన్ని వైన్స్‌లో విక్రయించాలని పథకం వేసిన సిబ్బంది సోమవారం రాత్రి ఆటోలో మద్యం సీసాలను తరలించారు. పట్టణంలోని ఓ వైన్స్‌కు మద్యాన్ని తీసుకెళ్లగా గమనించిన స్థానికులు ఆటోను వెంబడించి వీడియోలు తీశారు. అది గుర్తించిన వైన్స్ నిర్వాహకులు తాము ఈ మద్యాన్ని తీసుకోమని చెప్పగా అక్కడి నుంచి మరో వైన్స్‌కు మద్యాన్ని తరలించినట్లు తెలిసింది. సీఐ భాస్కర్‌రావు సెలవులో ఉండగా ఎస్సై రవళి చొరవతోనే ఈ వ్యవహారం నడిచిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ వ్యవహారంపై సీఐ భాస్కర్‌రావు వివరణ కోరేందుకు యత్నించగా ఆయన స్పందించలేదు.

ఉన్నతాధికారుల సమగ్ర విచారణ..

తొర్రూరు ఎక్సైజ్ ఆఫీస్ నుంచి మద్యం అక్రమంగా రవాణా చేశారనే వార్త సోషల్ మీడియా ద్వారా ప్రచారం జరిగింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టే పనిలో ఎక్సైజ్‌శాఖ ఉంది. విచారణ తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయి.

- కిరణ్, జిల్లా ఎక్సైజ్ అధికారి

వైస్ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న వైస్ చైర్మన్ మార్నేని



మద్దతు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు

- మానుకోట మున్సిపల్ వైస్ చైర్మన్‌గా మార్నేని వెంకన్న
- 32 మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్ అఫీషియో మెంబర్ల హాజరు
- ఇద్దరు సీపీఐ కౌన్సిలర్లు, మాజీ వైస్ చైర్మన్ డుమ్మా
- గంటలోపులో ప్రకియ పూర్తి.. వెంటనే ప్రమాణ స్వీకారం
- భారీ బందోబస్తు నిర్వహించిన పోలీసులు

మహబూబాబాద్: మానుకోట మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం మానుకోట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రిసైడింగ్ అధికారి, ఆర్డీఓ అలివేలు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించగా.. 32మంది కౌన్సిలర్లు, ఇద్దరు ఎక్స్ అఫీషియో మెంబర్లు(ఎమ్మెల్సీ, ఎంపీ) హాజరయ్యారు. కాగా వైస్ చైర్మన్‌గా కౌన్సిలర్ మార్నేని వెంకన్నను ఓ కౌన్సిలర్ ప్రతిపాదించగా.. మరో కౌన్సిలర్ బలపర్చారు. పోటీ లేకపోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. గంటలోపే ప్రక్రియ ముగియడంతో మార్నేని వెంకన్నతో ప్రిసైడింగ్ అధికారి ప్రమాణస్వీకారం చేయించారు. కాగా ఇటీవల కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో అప్పటి వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్ పదవి కోల్పోయిన విషయం తెలిసిందే.

ఇలా వచ్చారు..

మున్సిపాలిటీ కార్యాలయంలో వైస్ చైర్మన్ ఎన్నిక కోసం కమిషనర్ నోముల రవీందర్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 10.20 గంటలకు బీఆర్‌ఎస్ మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ హాజరు కాగా.. 10.30 గంటలకు చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, సీపీఎం మున్సిపల్‌ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, 10.32 గంటలకు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గద్దె నీరజా, గుండా స్వప్న హాజరయ్యారు. 10.37 గంటలకు ఆర్డీఓ అలివేలు హాజరు కాగా.. 10.43 ప్రత్యేక బస్సులో కౌన్సిలర్లు మార్నేని వెంకన్నతో పాటు భూక్య శ్రీను, హరిసింగ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు కార్యాలయానికి వచ్చారు. ఆతర్వాత మరికొంతమంది కౌన్సిలర్లతో పాటు ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు హాజరయ్యారు.

బలపర్చి ఏకగ్రీవం చేసి..

సీపీఐ కౌన్సిలర్లు అజయ్‌సారథిరెడ్డి, బి.నీరజారెడ్డి ధర్మన్నతో పాటు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ మహమ్మద్ ఫరీద్ గైర్హాజరయ్యారు. కాగా కౌన్సిలర్ మార్నేని వెంకన్న పేరును ఒకటో వార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి ప్రతిపాదించగా 29వ వార్డు కౌన్సిలర్ సూర్నపు సోమయ్య బలపర్చారు. ఒక్కరే పోటీలో ఉండడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆ తర్వాత ప్రిసైడింగ్ అధికారి అలివేలు వైస్ చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం వైస్ చైర్మన్ వెంకన్నను ఎంపీ, ఎమ్మెల్సీ, చైర్మన్, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. తన ఎన్నికకు సహకరించి ప్రతి ఒక్కరికి వైస్ చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆర్డీఓ అలివేలు మాట్లాడుతూ.. ఎన్నిక సజావుగా జరిగిందన్నారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆదేశాలతో ఎన్నిక నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ నోముల రవీందర్, మేనేజర్ శ్రీధర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ బందోబస్తు..

మున్సిపల్ కార్యాలయం ఎదుట మానుకోట టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బారికేడ్లు ఏర్పాటు చేసి కార్యాలయ సిబ్బంది, కౌన్సిలర్లకు మాత్రమే అనుమతించారు. ఎస్పీ చెన్నయ్య బందోబస్తును పర్యవేక్షించారు. కార్యాలయం ఎదుట రాకపోకలు నిలిపివేయడంతో పాటు 144 సెక్షన్ అమలు చేసి కేంద్ర బలగాలను మోహరించారు. కనీసం మీడియాకు కూడా అనుమతివ్వలేదు.

న్యూస్‌రీల్

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



నెహ్రూసెంటర్: అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని 108 అంబులెన్స్‌ల జిల్లా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో 108 వాహనాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాల్లో పరికరాలు, మందులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని, సకాలంలో వైద్యం అందించేలా ఉద్యోగులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ బత్తిని మహేష్, సిబ్బంది, ఈఎంటీ వేపిశెట్టి నరేష్, పైలట్ రాము, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు వీరభద్రస్వామి హుండీ లెక్కింపు

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ప్రధాన హుండీల ఆదాయాన్ని ఈ నెల 28న లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 2నుంచి 27వ తేదీ వరకు హుండీల్లో భక్తులు సమర్పించుకున్న కానుకలను లెక్కిస్తామన్నారు. ఆలయ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

జాగ్రత్తలు పాటించాలి

నెహ్రూసెంటర్: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ కళావతిబాయి మంగళవారం సూచించారు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ, తెల్లని నూలు వస్త్రాలను ధరించాలని, వడదెబ్బకు గురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. పిల్లలు, 60 సంవత్సరాలు పైబడిన వారు, అనారోగ్యంతో బాధపడేవారు తరుచూగా తాగునీరు, ఓఆర్‌ఎస్ తీసుకోవాలన్నారు. ఉదయం 12 గంటల లోపు, సాయంత్రం 4గంటల తర్వాత బయటకు వెళ్లి పనులు చూసుకోవాలన్నారు. పీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. జిల్లా పర్యవేక్షణ, ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశామని డీఎంహెచ్‌ఓ వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: గ్రూప్స్‌లో ఉచిత శిక్షణ కోసం ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ఇన్‌చార్జ్ అధికారి బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌స్టడీసర్కిల్.కామ్.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుదారులు ఈ నెల 28తేదీన ధ్రువపత్రాల పరిశీలనకు జిల్లా కార్యాలయంలో హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు అడ్మిషన్ స్లిప్‌లు ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు 9440120620 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

గుడి నిర్మాణ లెక్కలు చెప్పాలి



కేసముద్రం: నూతనంగా నిర్మించిన సీతారామచంద్ర స్వామి ఆలయ నిర్మాణ లెక్కలు చెప్పాలని పలువురు గ్రామస్తులు రాస్తారోకో చేసిన ఘటన మంగళవారం మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో జరిగింది. ఆలయ నిర్మాణానికి దాతల నుంచి వచ్చిన విరాళాలు.. నిర్మాణానికి చేసిన ఖర్చుల వివరాలు ఆలయ కమిటీ సభ్యులకు చూపించాలంటూ పలువురు డిమాండ్ చేశారు. కాగా వచ్చే నెల 2న ఆలయ నిర్మాణానికి సంబంధించిన ఖర్చుల వివరాలను సభ్యులకు చూపనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- వీసీలో సీఎస్ శాంతికుమారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మహబూబాబాద్: గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి కలెక్టర్లు, సబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, 461 జీపీలు ఉన్నాయని తాగునీటి సమస్య లేకుండా ప్రత్యేక కార్యాచరణతో ముంకెళ్లాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండాలన్నారు. సీఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయించాలన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో 125, జీసీసీ 7, ఐకేపీ ఆధ్వర్యంలో 49, ఇతర 4కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. వీసీలో జిల్లా నుంచి అదనపు కలెక్టర్లు డేవిడ్, లెనిన్ వత్సల్ టొప్పో తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల శాఖలో అక్రమ పోస్టింగులు!

- జోనల్ నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు
- ఉమ్మడి వరంగల్‌లో పలుచోట్ల జరిగినట్లు ఆరోపణలు
- గత ప్రభుత్వ హయాంలో బదిలీలు, పోస్టింగ్‌లపై ఆరా
- త్వరలోనే రిజిస్ట్రేషన్ల శాఖలో తిరిగి ట్రాన్స్‌ఫర్లు?



వరంగల్ ఆర్వో కార్యాలయం

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తున్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖను ప్రక్షాళన దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖలో రెండేళ్ల కిందట జరిగిన జోనల్ బదిలీలు, పోస్టింగ్‌ల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అక్రమాలు జరిగినట్లు అందిన ఫిర్యాదులపై స్పందించిన ప్రభుత్వం వీటిపైన విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌లో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో వివిధ కేడర్‌లలో జరిగిన నియామకాలపైనా విచారణ జరుగుతోంది. రెండేళ్ల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జోనల్ వ్యవస్థను ఉల్లంఘిస్తూ చేపట్టిన బదిలీలపై మార్పులు చేర్పులు తప్పవని అధికారులు చర్చించుకుంటున్నారు. గ్రేడ్–1 స్థాయిలో గ్రేడ్–2 అధికారులను నియమించడంపై గతంలోనే రచ్చ జరిగింది. తాజాగా ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ప్రక్షాళనకు సిద్ధం కాగా.. అక్రమ బదిలీలు, పోస్టింగ్‌ల వ్యవహారం ఆశాఖలోని అధికారుల్లో చర్చనీయాంశం అవుతోంది.

గ్రేడ్–1 స్థాయిలో.. గ్రేడ్–2 అధికారులు...

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వరంగల్ ఆర్వో, జనగామ, మహబూబాబాద్, డీఐజీ కార్యాలయంలో గ్రేడ్–1 స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తారు. రెండేళ్ల క్రితం నాటి ప్రభుత్వం చేపట్టిన మల్టీజోన్, జోనల్ బదిలీల్లో జనగామ, మహబూబాబాద్‌కు గ్రేడ్–1స్థాయి అధికారులు, వరంగల్ ఆర్వోకు గ్రేడ్–2 స్థాయి అధికారులు వచ్చారు. వరంగల్ ఆర్వో కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ పర్యవేక్షణలో ఒక గ్రేడ్–1, ఒక గ్రేడ్–2స్థాయి సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వహించాల్సి ఉండగా ఇద్దరూ గ్రేడ్–2 స్థాయి వారినే కొనసాగించడం బదిలీల్లో జోనల్ ఉల్లంఘన కనిపిస్తోందని ఆశాఖకు చెందిన వారే ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్‌లో ఎక్కడ ఈ పరిస్థితి ఉందన్న కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వాస్తవానికి ఉండాల్సిన సిబ్బంది ఎంత? ప్రస్తుతం ఎంత మంది ఉన్నారు? రెండేళ్ల కిందట జరిగిన జోనల్ బదిలీల్లో ఇంకా ఎక్కడెక్కడ ఉల్లంఘనలు జరిగాయి? అన్న కోణంలో ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుండటంపై ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

ప్లాంటేషన్ పరిశీలన



ప్లాంటేషన్ వివరాలను తెలుసుకుంటున్న డీఎఫ్‌ఓ

గూడూరు: మండల రేంజ్ పరిధి ఫారెస్టులోని ఎస్‌టీఎస్‌హెచ్ ప్లాంటేషన్‌ను మంగళవారం డీఎఫ్‌ఓ బత్తుల విశాల్, ఎఫ్‌డీఓ చంద్రశేఖరరావు అటవీఅధికారులతో కలిసి తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భీముని జలపాతాన్ని సందర్శించి సందర్శకుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఎస్‌ఓ, ఆర్‌ఓ, ఎఫ్‌బీఓ పాల్గొన్నారు.

‘మున్నేరు’కు మోక్షమెప్పుడో..?

- గార్లలో ప్రాజెక్టు నిర్మాణంపై నీలినీడలు
- వైఎస్సార్ హయాంలో రూ.131.67 కోట్లు మంజూరు
- కృష్ణానదిలోకి వృథాగా పోతున్న పాకాల ఏటి నీరు
- ప్రాజెక్టు నిర్మిస్తే 30 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ



పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్ట్ నిర్మించే ప్రతిపాదిత స్థలం (ఫైల్)

గార్ల: తలాపున నీళ్లున్నా.. ఎకరం పారని పరిస్థితి. ఏటా వానాకాలంలో ఏటి నీరు కృష్ణానదిలో వృథాగా పోతున్నాయి. దీంతో రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. గార్ల మండలంలోని ముల్కనూరు వద్ద పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్టు నిర్మించాలని ఈ ప్రాంత రైతులు నాలుగు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా 30వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని రైతులు తెలుపుతున్నాయి. కాగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో ప్రాజెక్టు నిర్మాణానికి అడుగు పడి.. 2009లో రూ.131.67 కోట్లు మంజూరు చేశారు. ఆ తర్వాత దురదృష్టవశాత్తు వైఎస్సార్ మరణంతో ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. కాగా ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి హయాంలోనైనా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసి తమ కల సాకారం చేయాలని రైతులు కోరుతున్నారు.

వెంగళరావు హయాంలో సర్వే..

పాకాల ఏటిపై ప్రాజెక్టు నిర్మాణంతో 30వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని తెలపడంతో నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు స్పందించి ఇంజనీరింగ్ అధికారులను సర్వేకు పంపినట్లు రైతులు పేర్కొంటున్నారు. అయితే నాలుగు దశాబ్దాలుగా ప్రాజెక్టు ఊసే ఎత్తలేదు. ఈక్రమంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2003లో ప్రతిపక్ష హోదాలో పాదయాత్రలో భాగంగా గార్ల మండలానికి వచ్చారు. ఆ సయయంలో ఈ ప్రాంత రైతులు ఆయనను కలిసి ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. అధికారంలోకి రాగానే ప్రాజెక్టు నిర్మిస్తానని హామీ ఇచ్చి.. 2009లో ఎన్నికల ముందు నిర్మాణం కోసం రూ.131.67 నిధులు విడుదల చేశారు. అయితే రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దురదృష్టవశాత్తు హెలికాప్టర్ దుర్ఘటనలో వైఎస్సార్ మరణంతో ప్రాజెక్టు ఆగిపోయింది.

ఇప్పటికైనా..

ప్రాజెక్టు నిర్మాణం చేపడితే గార్ల, కామేపల్లి, డోర్నకల్, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన సుమారు 30వేల ఎకరాలకు సాగునీరుతో పాటు తాగునీరు అందుతుంది. కాగా ప్రాజెక్టు నిర్మాణం కోసం వివిధ పార్టీల నాయకులతో మున్నేరు జన సాధన కమిటీని వేశారు. కమిటీ చైర్మన్‌గా నాటి ఇల్లెందు ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్యను ఎన్నుకున్నారు. పలుమార్లు గుమ్మడి నర్సయ్యతో జలసాధన కమిటీ సభ్యులు గత ముఖ్యమంత్రులను కలిసి విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. చివరికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసినా ఫలితం కానరాలేదు. ప్రస్తుతం స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మున్నేరు ప్రాజెక్ట్ కోసం నిధులు మంజూరు చేయించి నిర్మాణం పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

మున్నేరు ప్రాజెక్ట్ నిర్మించాలి



ఏటా వానాకాలంలో 3 నెలలు పాకాల ఏటి నుంచి నీళ్ల వృథాగా వెళ్లి కృష్ణానదిలో కలుస్తున్నాయి. పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్ట్ నిర్మిస్తే 30వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

-గడ్డిపాటి రాజారావు, రైతు, సీతంపేట, గార్ల


రెండు పంటలు సాగవుతాయి



ఈ ప్రాజెక్ట్ నిర్మించడం వల్ల వానాకాలం, యాసంగి రెండు పంటలు సాగవుతాయి. సాగునీటితో పాటు తాగునీటి ఎద్దడిని నివారించవచ్చు. 40 ఏళ్ల నుంచి ఈ ప్రాజెక్ట్ కోసం పలుమార్లు ముఖ్యమంత్రులు నిర్వహించిన సర్వేలు కాగితాలకే పరిమితమయ్యాయి. ఇప్పటికైనా ప్రాజెక్టు నిర్మించి సాగునీరందించాలి.

-వై.కృష్ణారెడ్డి, రైతు, రాంపురం, గార్ల

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

తొర్రూరు: ఉపాధిహామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని ఏపీడీ శాంతకుమారి తెలిపారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమం చేపట్టారు. 2023లో మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. 12 గ్రామాలకు సంబంధించిన ఈజీఎస్ సిబ్బంది ఉపాధిహామీ పనులకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీడీ మాట్లాడుతూ.. ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు జరిగితే ఉపేక్షించబోమన్నారు. జాబ్‌కార్డు ఉన్న పేదలకు ఉపాధి పని చూపించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉందన్నారు. ఎంపీడీఓలు సిలార్ సాహెబ్, కుమార్, ఏపీఓలు మధు, పార్థసారథి, అంబుడ్స్‌మెన్ ఆడమ్, రాజు, నర్సయ్య, పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా



మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా

ఏటూరునాగారం: ఎన్నికలు ముగిసిన తర్వాత గిరిజనాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి మారుమూల గ్రామాల్లోని విద్యార్థులు, మహిళలకు విద్య, వైద్యం అందేలా చూస్తామని ఐటీడీఏ ఏటూరునాగారం పీఓ చిత్రామిశ్రా తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన అనంతరం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని తెలిపారు. వేసవి నేపథ్యంలో గిరిజన గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో కాంట్రాక్టర్లు చేపట్టిన రోడ్ల నిర్మాణ పనుల్లో జాప్యానికి కారణాలు తెలుసుకుంటామని వివరించారు. అవసరమైతే కాంట్రాక్టర్ల కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కొత్తవారికి కేటాయించి అసంపూర్తి పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో విద్యను బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామన్నారు. అందుకు ఐటీడీఏ సెక్టార్ అధికారులతో ప్రత్యేక అధికారుల బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. సంబంధిత అధికారులు వారి పరిధిలోని పాఠశాలలను నెలలో రెండుసార్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితులపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించామన్నారు. వసతులు, పౌష్టికాహారం, విద్యా పరమైన అంశాలపై పరిశీలిస్తామని తెలిపారు. వైద్యపరంగా తీసుకుంటున్న చర్యలపై తాను క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పరిశీలిస్తున్నానని వెల్లడించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటానని వివరించారు. వైద్య శిబిరాలు నిర్ణీత సమయాల మేరకు గిరిజన గ్రామాల్లో చేపడుతున్నారని, మందులు పంపిణీ చేస్తున్నారని తెలిపారు.



దుగ్గొండి మండలం గిర్నిబావి నుంచి జాతరకు వెళ్తున్న కాంగ్రెస్ ప్రభలు



బీఆర్ఎస్ ప్రభలను కొమ్మాలకు తీసుకెళ్తున్న నాయకులు



నర్సంపేటలో ప్రభబండ్లను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



సీపీఎం ప్రభ ఎదుట విన్యాసాలు చేస్తున్న డప్పు కళాకారులు

'కొమ్మాల'లో రాజకీయ ప్రభల జోరు ..

వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర రాజకీయ రంగు పులుముకుంది. ఈసారి అధికారులు అనుమతి ఇవ్వడంతో పలు పార్టీల శ్రేణులు పోటాపోటీగా మంగళవారం ప్రభలను తీసుకొచ్చాయి. నర్సంపేట, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు జెండాలు, ఫ్లెక్సీలు కట్టి ప్రభలను తరలించారు. నినాదాలతో హోరెత్తించారు. దీంతో మచ్చాపురం నుంచి లక్నెపల్లి వరకు ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

- నర్సంపేట/దుగ్గొండి/గీసుకొండ

సాగులో మెళకువలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్ : రైతులు వివిధ రకాల పంటల సాగులో మెళకువలు పాటించాలని, తద్వారా అధిక దిగుబడులు లభిస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సీడ్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ సెంటర్ డైరెక్టర్ పి.జగన్మోహన రావు అన్నారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని విత్తన పరిశోధన సాంకేతిక విభాగం సహకారంతో మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వివిధ పంటల్లో విత్తన ఉత్పత్తిపై శిక్షణ నిర్వహించారు. వరి, కంది, వేరుశనగ, ఇతర పంటల్లో నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో విత్తన ఉత్పత్తి, రకాల లభ్యత, విత్తే దూరం అంశాలపై వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.సుకుమార్.. వరి పంటలో పాటించాల్సిన మెళకువలు వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.స్వర్ణలత మాట్లాడుతూ విత్తన ఉత్పత్తి రైతులు కందిలో నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసి సహరైతులకు అందించాలన్నారు. మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి మాట్లాడుతూ పంటల్లో చీడపీడల యాజమాన్యంపై తెలియజేశారు.

దరఖాస్తు గడువు పెంపు

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–1 ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు గడువును వచ్చే నెల 9వ తేదీ వరకు పొడగించినట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి, హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజులు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ అందిస్తామని తెలిపారు. అర్హులై ఆసక్తి గల మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులు హనుమకొండ సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులో గల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 7330990322 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సినీ ఫక్కీలో చోరీ..

- పార్క్ చేసిన కారు అద్దాలు ధ్వంసం
- రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు



బాధితుడు ప్రతాప్‌రెడ్డి

జనగామ : పార్క్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన తుమ్మ ప్రతాప్‌రెడ్డి పట్టణంలోని సిద్దిపేట రోడ్డు ఐసీఐసీఐ బ్యాంకులో రూ.2 లక్షల నగదు డ్రా చేసుకున్నాడు. అక్కడ నుంచి బయలుదేరగా.. ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించారు. ఆర్టీసీ చౌరస్తాకు చేరుకునే లోపు రెండు సార్లు కారులో ఉన్న వ్యక్తిని పిలుస్తూ... వాహనం నుంచి ఆయిల్ కారుతుందని చెప్పే ప్రయత్నం చేశారు. హైదరాబాద్ రోడ్డులోని పెట్రోలు బంకు వద్దకు వెళ్లిన తర్వాత, ఇంజిన్ చెక్ చేసుకుని ఆయిల్ కారడం లేదని నిర్ధారించుకున్నారు. కారులో పెట్రోలు పోయించుకుని.. సమీపంలో ఉన్న ఐడీబీఐ బ్యాంకుకు వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు కారును వెంబడించారు. అనంతరం బ్యాంకు ఎదుట పార్క్ చేసిన కారు అద్దాలు పగుల గొట్టి, అందులో ఉన్న రూ.2 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బ్యాంకులో పని ముగించుకుని కారు వద్దకు వచ్చిన ప్రతాప్‌రెడ్డి ధ్వంసమైన అద్దాలను చూసి ఆందోళనకు గురయ్యారు. కారులో నగదు ఉన్న బ్యాగు లేకపోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కాగా, జనగామ నడిబొడ్డున జరిగిన ఈ ఘటనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసు కంట్రోల్ రూమ్ సమీపంలో ఈ ఘటన జరగడం గమనార్హం. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

ఖాతాదారుల కష్టాలు..

ఏనుమాముల ఎస్‌బీఐలో సేవలు కరువు

- ఇద్దరు అధికారులపైనే నిర్వహణ భారం
- ఇబ్బందుల్లో రైతులు, వ్యాపారులు, మహిళాసంఘాల సభ్యులు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వినతి

వరంగల్: ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో వినియోగదారులకు సేవలు కరువయ్యాయి. రైతులు, వ్యాపారులు, ఈప్రాంతంలోని ప్రజలకు సేవలు అందించేందుకు మార్కెట్ కమిటీ సూచనలతో 2000 సంవత్సరంలో ఎస్‌బీహెచ్ తన బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఇందుకుగాను బ్యాంక్‌కు కావాల్సిన భవనం కూడా మార్కెట్ కమిటీ నిర్మించి ఇచ్చింది. బ్రాంచ్ ప్రారంభ సమయంలో వినియోగదారులకు త్వరతగతిన సేవలు అందించేందుకు కావాల్సిన అధికారులు, సిబ్బందిని నియమించడంతో వ్యాపారులు బ్యాంకులో తమ ఖాతాలు తెరిచారు. కాల క్రమంలో బ్యాంకులో వ్యాపారుల ఖాతాలు 300 నుంచి 400 వరకు ఉండగా సేవింగ్ బ్యాంక్ అకౌంట్లు సుమారు 30వేల వరకు ఉన్నాయి. 14వ డివిజన్ పరిధిలోని ఏనుమాముల, సుందరయ్యనగర్, బాలాజీనగర్, ఇందిరమ్మ కాలనీ 1, 2, ముసలమ్మకుంట, మధురానగర్, లక్ష్మీపతిగణపతి కాలనీ, సాయిగణేష్‌కాలనీ, ఎస్ఆర్‌నగర్ తదితర కాలనీల్లోని మహిళా సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)కూడా ఈబ్యాంకులోనే ఖాతాలు తీస్తారు. మార్కెట్‌లో పంట ఉత్పత్తులు విక్రయిస్తే వెంటనే డబ్బులు జమ చేసుకునేందుకు పరకాల, ఆత్మకూరు, నర్సంపేట తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, రైతులు ఇక్కడ ప్రత్యేకంగా ఖాతాలు తీసుకున్నారు. అయితే ఖాతాలు పెరిగినా బ్యాంకు ఉన్నతాధికారులు ఈబ్రాంచ్‌పై శీతకన్ను వేశారు. కేవలం ఇద్దరు ముగ్గురు అధికారులను నియమించారు. వారిలో కూడా ఒకరు ఎప్పుడు లీవ్‌లోనే ఉండడం లేదా వేరే బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈబ్యాంకులోని మేనేజర్, క్యాషియర్ ఇద్దరే నలుగురి పనులు చేస్తుండడంతో సేవలు అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏనుమాముల బ్రాంచ్ అంటేనే అధికారులు భయాందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. ఇందులో విధులు నిర్వర్తించడం అంటే పనిష్మెంట్ అనే భావన ఉద్యోగుల్లో వచ్చినట్లు సమాచారం. ఈ బ్యాంకుకు మేనేజర్‌గా వచ్చిన అధికారి ఏడాది కూడా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రతి నెల మొదటి వారం వచ్చిందంటే మహిళా సంఘాల ప్రతినిధులతో బ్యాంకు కిటకిటలాడుతుంది. డబ్బులు జమ చేయాలంటే రెండు, మూడు గంటల సమయం పడుతోంది. ఆధార్ అప్‌డేట్, కేవైసీ లాంటి మార్పులు చేసుకోవాలని రెండు, మూడు రోజులు పనులు బంద్ చేసి బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు.

జమ అయితేనే డబ్బు చెల్లింపులు...

బ్యాంకులో వినియోగదారులు జమ చేస్తే తప్ప పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లింపులు చేయలేని పరిస్థితుల్లో బ్రాంచ్ నడుస్తోంది. వ్యాపారులు ఎక్కువ తమ ఖాతాల్లో నుంచి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయిస్తుండడంతో నగదు కావాల్సిన వారు వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం ఉదయం ఓ వ్యాపారి బ్యాంకు వచ్చి రూ.5 లక్షలు కావాలంటే మధ్యాహ్నం ఒంటి గంటకు చెల్లించారు. అదే మరొకరికి రూ.3లక్షలు.. మధ్యాహ్నం 2గంటలకు చెల్లింపులు జరిగాయి. ఇదేంటని అడిగితే అధికారులు తాము ఏం చేయలేమనే సమాధానం ఇస్తున్నారు. ఇక్కడ సేవలు ఆలస్యమవుతుండడంతో వ్యాపారులు సూచనలతో ఇటీవల జంక్షన్‌లో ఓ ప్రైవేటు బ్యాంకు ప్రారంభించారు. అయితే ఇక్కడ సరిపడ అధికారులను నియమించి మెరుగైన సేవలు అందిస్తేనే ఈబ్యాంకులో ఖాతాలు కొనసాగిస్తామని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు.



ఏనుమాముల మార్కెట్ ఆవరణలోని బ్యాంకు

సేవలు లేవు..



మార్కెట్‌లోని రైతులతో పాటు ఈప్రాంత ప్రజలు, వ్యాపారుల కోసం బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ సేవలు అందడం లేదు. బ్యాంక్‌కు రావాలంటే భయంగా ఉంది. ఎప్పుడు పని అవుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యాపార నిమిత్తం పీఓఎస్ మిషన్లు ఇచ్చి తీసుకోవడం లేదు. జరిమానా వేస్తామని టోల్‌ఫ్రీ నంబర్ నుంచి హెచ్చరికలు చేస్తున్నారు. ఈవిషయంపై బ్రాంచ్‌లో సంప్రదిస్తే సమాధానం లేదు. బ్రాంచ్‌లో సేవలు అందించేందుకు పూర్తి స్థాయిలో సిబ్బంది, అధికారులను నియమించాలి

-రఘునారెడ్డి, వ్యాపారి

సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపి.. ఇంటికి రప్పించి

- కూతురిని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో యువకుడిపై దాడికి పాల్పడిన తండ్రి..

నర్సంపేట రూరల్ : కూతురిని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో తండ్రి.. ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నర్సంపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమణామూర్తి మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు ఐదు సంవత్సరాల క్రితం నర్సంపేటకు చెందిన ఓ యువతి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చర్లపాలెం చెందిన ధర్మారపు ప్రకాశ్.. హనుకొండలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్నారు. ఈ సమయంలో ఇద్దరు ప్రేమించుకున్నారు. తమ ప్రేమ విషయం ఇరువురు ఇళ్లలో చెప్పడంతో వారు అంగీకరించలేదు. పైగా గొడవలు జరిగాయి. ప్రకాశ్‌పై ఐదునెలల క్రితం నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు. అప్పటి నుంచి ప్రేమికులు దూరంగానే ఉంటున్నారు. అయితే సదరు యువతి తండ్రి శ్రీనివాస్‌కు అనుమానం వచ్చింది. ఈనెల 24న తన కూతురి సెల్‌ఫోన్ నుంచి ఇంటికి రావాలంటూ ప్రకాశ్‌కు మెసేజ్ పంపించాడు. దీంతో రాత్రి 25 రాత్రి ప్రకాశ్.. యువతి ఇంటికి రావడంతో శ్రీనివాస్‌తోపాటు మరికొందరు కలిసి దాడి చేశారు. దీంతో ప్రకాశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే హనుకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ప్రకాశ్ తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌తోపాటు ఏడుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

30న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 39వ అకడమిక్ సెనెట్ సమావేశం ఈ నెల 30న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. క్యాంపస్ పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో జరగనున్న ఈ సమావేశానికి అకడమిక్ సెనెట్‌మెంబర్లు, డీన్‌లు, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇందులో కేయూ బడ్జెట్‌ను కూడా ప్రవేశపెట్టనున్నారు.

ప్రాసల ఝరి.. మాటల సిరి

- వ్యాఖ్యాతగా రాణిస్తున్న సారం ప్రవీణ్ కుమార్
- జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు వ్యాఖ్యానం
- తెలుగు భాషకు తన మాట, పాట ద్వారా చేయూత



వ్యాఖ్యానం చేస్తున్న ప్రవీణ్

హన్మకొండ : సభలోని ఆహుతులను తన మాటలతో ఆకట్టుకుని.. సందర్భానుసారం కవితలు, పాటల ద్వారా సభికులను ఉత్సాహపరచడం వ్యాఖ్యాత విధి. సాహితి, కళా ప్రక్రియలో భాగమైన వ్యాఖ్యానానికి తనదైన శైలిలో న్యాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు సారం ప్రవీణ్ కుమార్. హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో అధికారిగా పనిచేస్తూ ప్రవృత్తి పరంగా కవి, రచయిత, గాయకుడిగా, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వ్యాఖ్యాతగా తన ప్రతిభ చాటుకుంటున్నాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్.. సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–9192 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదుకున్నాడు. అప్పుడే కళారంగంపై దృష్టి సారించాడు. అనంతరం వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ, సోషల్ వర్క్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక వేదికలపై జానపద, సామాజిక గీతాలు ఆలపించి అనేక ప్రశంసలు పొందాడు.

ప్రవీణ్‌పాటకు తొలి గురువులు తల్లిదండ్రులు..

ప్రవీణ్‌పాటకు తొలి గురువులు అతడి తల్లిదండ్రులు. ఆ తర్వాత మిత్రుడు చిలువేరు శ్రీనివాస్, సింగారపు బాబు, పర్కాల శ్యాంసన్, మెట్టుపల్లి మల్లయ్య, బొజ్జ సురేష్, మెట్టుపల్లి కొమురయ్య ప్రోత్సాహంతో సాంస్కృతిక రంగంలో రాణిస్తున్నాడు. పాటలు, కవితలు రాయడం, ప్రభుత్వ కార్యక్రమాలపై వ్యాసాలు రాయడం, పుస్తకాలకు సమీక్ష రాయడం తన ప్రవృత్తిలో భాగమైంది.

తొలుత పాటలకు కోరస్..

ప్రవీణ్ కుమార్ తొలుత పలు జానపద కళా బృందాలతో కలిసి వారు పాడిన పాటలకు కోరస్ పాడేవాడు. అనతి కాలంలో దివంగత వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి లాంటి గాయకులతో కలిసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో తన గళం వినిపించాడు.

2018 నుంచి వ్యాఖ్యాత..

తెలుగు భాషపై మక్కువతో 2018 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమమైనా, ఏదేని సాంస్కృతిక కార్యక్రమమైనా వ్యాఖ్యాతగా తన ప్రత్యేకత చాటుకుంటున్నాడు. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో కవుల సమక్షంలో చెత్త బండి దీర్ఘ కవిత సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రముఖ వ్యాఖ్యాతలు మఖ్దుమ్, మడిపల్లి దక్షిణమూర్తి, ప్రముఖ కవి అన్వర్ వ్యాఖ్యానంతో స్ఫూర్తిపొంది తన ప్రస్థానం కొనసాగిస్తున్నాడు.

బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్



రోగితో వైద్య బృందం


ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో మొదటిసారి బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ తెలిపారు. కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన బుర్ర స్వరూప ఈ నెల 11వ తేదీన న్యూరో సర్జరీ విభాగంలో అడ్మిట్ అయిందన్నారు. బ్రెయిన్‌లో ట్యూమర్ పెరగడంతో అధిక తలనొప్పి, నరాల బాధ పిట్స్‌తో బాధపడుతోందన్నారు. ఈ క్రమంలో 18వ తేదీన శస్త్రచికిత్స నిర్వహించి ప్రత్యేక అబ్జర్వేషన్‌లో ఉంచి మెరుగైన వైద్య చికిత్సలు అందించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సను న్యూరోసర్జరీ విభాగాధిపతి మహ్మద్ సికిందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సచిన్, వీరేశ్, అనస్తీషియా వైద్యులు మురళి, చంద్రశేఖర్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సకు ప్రైవేట్‌లో సుమారు రూ. 5 నుంచి రూ. 6 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు.

వేర్వేరు కారణాలతో నలుగురి మృతి

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

దుగ్గొండి: చెరువులో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన దుగ్గొండిలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన పర్లపెల్లి విజయ(45) సోమవారం సాయంత్రం బయటకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో శవమై కనిపించింది. మృతురాలికి కుమారులు ప్రశాంత్, పవన్ ఉన్నారు.

తాటిచెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు..



బక్కయ్య (ఫైల్)

తరిగొప్పుల: తాటి చెట్టుపై నుంచి జారిపడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన తరిగొప్పులలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి బక్కయ్య (52) రోజు మాదిరిగా మంగళవారం ఉదయం కల్లు తీయడానికి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో జారిపడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే కుటుంబీకులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజుమృతి చెందాడు.


చికిత్స పొందుతూ క్రీడాకారుడు..



శ్రీనివాస్ (ఫైల్)

కాజీపేట: ఈ నెల 24వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ అంతర్జాతీయ క్రీడాకారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాజీపేట పట్టణానికి చెందిన నల్లెల శ్రీనివాస్ (47) ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఎన్నో అవార్డులు అందుకున్నారు. కొంత కాలంగా హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కోచ్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో హసన్‌పర్తిలోని బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో భార్య పద్మతో కలిసి హాజరయ్యారు. అనంతరం కాజీపేటకు వచ్చి రహమత్‌నగర్ చౌరస్తాలో తండ్రి వీరాస్వామిని కలిసి రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు.

ఏటూరునాగారంలో యువకుడు..



మణికుమార్(ఫైల్)

ఏటూరునాగారం : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు..ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ కథనం ప్రకారం ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సమ్మయ్య, సమ్మక్క దంపతుల కుమారుడు మణికుమార్ (20) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మండల కేంద్రానికి చెందిన కొండాయి సంధ్యను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే కొన్ని రోజుల నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఈనెల 23వ తేదీన సంధ్య పుట్టింటికి వెళ్లింది. మణికుమార్ అత్తగారి ఇంటికి వెళ్లి కాపురానికి రావాలని సంధ్యను కోరగా ఆమె తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో మణికుమార్ మనస్తాపం చెంది ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఏటూరునాగారం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం ములుగుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, మృతుడు సూసైట్ నోట్ జేబులో పెట్టుకోవడం గమనార్హం. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం.. సామాజిక సేవ

- కేయూ వీసీ తాటికొండ రమేష్



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ రమేష్, పక్కన ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

కేయూ క్యాంపస్ : రక్తదానం.. ఇతరులకు ప్రాణదానమని, ఇది సామాజిక సేవా కార్యక్రమమని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితులు, తలసేమియా బాధితులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జ్యోతి మాట్లాడుతూ తలసేమియా బాధితులకు నిత్యం రక్తం అవసరం ఉంటుందన్నారు. వారి కోసం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చందులాల్, డాక్టర్ శ్రీనివాస్ , అధ్యాపకులు డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ సంజీవ పాల్గొన్నారు. కాగా, 80 మంది విద్యార్థులు, పలువురు అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి విజయ్‌చందర్‌రెడ్డి, పాలకవర్గసభ్యులు ఈ వి శ్రీనివాస్‌రావు, మాంగళిశేషుమాధవ్, పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు,బిల్ల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు వీసీ రమేష్ సర్టిఫికెట్లు అందజేశారు.

రామేశ్వరానికి అభినందన



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, నేచురోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్‌సెంటర్ వ్యవస్థాకుడు గజ్జల రామేశ్వరంను కేయూ వీసీ తాటికొండ రమేష్ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. న్యూఢిల్లీలోని జేఎన్‌యూలో ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు జరిగిన 8వ వరల్డ్ క్యాన్సర్ కాంగ్రెస్ 2024లో ఆచార్య రామేశ్వరం పాల్గొన్నారు. 'నేచర్‌క్యూర్ మెథడ్స్ ఇన్‌ది మేనేజ్‌మెంట్ ఆఫ్ క్యాన్సర్ టూ సెంచరీస్ హిస్టారికల్ ఎవిడెన్సెస్ ఆఫ్‌ది వరల్డ్' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. ఈ అంశంలో సర్టిఫికెట్ పొందిన రామేశ్వరంను వీసీ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బ్రహ్మచారి మృతదేహం లభ్యం

హసన్‌పర్తి : గుండ్లసింగారం సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో గల్లంతైన కమలాపూర్ మండలం శ్రీరాములపల్లికి చెందిన రాపాక బ్రహ్మచారి(40) మృతదేహాన్ని మంగళవారం పోలీసులు కనుగొన్నారు. సంగెం మండలం తీగరాజుపల్లిలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే కేసు కేయూసీలో నమోదు కావడంతో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.